
ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి 2025

5

విజయనగరం



బడ్జెట్‌లో ఎంఎస్ఎంఇలకు భారీగా నిధులు : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్రబడ్జెట్‌లో ఎంఎస్ఎంఇ కోసం పెద్దఎత్తున నిధులు కేటాయించారని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విజయనగరంలోని తమ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల కోసం ప్రోత్సాహకాలు ఇచ్చిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్‌లో పెట్టిన అంశాలు మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పోలవరాన్ని పరుగులు పెట్టిస్తుందన్నారు. ఓర్వకల్లు, కడప, శ్రీ సిటీ అభివృద్ధి కోసం బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయించారన్నారు. స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఇవ్వడాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన అన్ని అంశాలకు కేంద్రం నుంచి ప్రోత్సాహం ఉందన్నారని చెప్పుకొచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో విద్యావ్యవస్థ ఎంతో అన్యాయం జరిగిందన్నారు. బొత్స హయాంలో విద్యా వ్యవస్థ ఎంత నిర్వీర్యం అయ్యిందో అందరికీ తెలుసు అన్నారు. వైసిపి హయాంలో మాటలు చెప్పారు తప్ప పనులు కాలేదని అన్నారు.

రాష్ట్రానికి ద్రోహం

కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం నిరసనలు



విజయనగరంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన జిల్లా అంతటా నిరసనలు తెలిపారు. ఆదివారం విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహనరావు, పి.రమణమ్మ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ మన రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. విశాఖ ఉక్కుకు గత బడ్జెట్ కంటే నిధులు తగ్గించిందన్నారు. మన జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయింపు చేయకపోవడం అన్యాయ మన్నారు. పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయించలేదన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించే విధంగా బడ్జెట్‌లో లేదన్నారు. ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్ కంటే కేటాయింపులు తగ్గించి ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. రైల్వేజోన్, విభజన చట్టంలోని అంశాల గురించి కనీస ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు. భీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐలు అనుమతించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలకు,రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసే బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం లో ఉన్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి కేటాయింపులపై కేంద్రాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణ, వి.లక్ష్మి, రామచంద్రరావు, రాము, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా గజపతినగరంలో సిపిఎం జిల్లా నాయకులు జి.శ్రీనివాస్, మెంటాడ మండల కన్వీనర్ రాకోటి రాములు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పోరేట్లకు అనుకూలంగా, కార్మిక, కర్షక, పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్నారు. బడ్జెట్‌లో మన రాష్ట్రానికి, జిల్లాకి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. గ్యాస్, ఎరువులు, ఆహార సబ్సిడీలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించారని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ అత్యంత నిర్లక్ష్యానికి గురైందన్నారు. మోడీ పాలనలో బడ్జెట్ మోసాన్ని ప్రజలు ఎదిరించి, హక్కులను, బడ్జెట్‌ను ఆయా రంగాల ప్రజలు పోరాడి సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనకరాజు, గోవింద్, సూర్యనారాయణ, శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలసలోని గాంధీనగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం జిల్లా నాయకులు గాడు అప్పారావు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజానీకానికి గాని, కార్మిక వర్గానికి గాని, రైతాంగానికి గాని బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదన్నారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ నిధుల్ని దారిమళ్లించారని, కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజానీకానికి, కార్మిక వర్గానికి, రైతాంగానికి అనుకూల బడ్జెట్ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మద్దిల రమణ, వంక ఆదినారాయణ, సబ్బవరపు హరీష్, గాడి సురేష్, మునురు రాజు, కందిపిల్లి తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.





కొత్తవలసలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు ; గజపతినగరంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు

ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

6న జరిగే నామినేషన్‌కు తరలి రావాలి • ఉపాధ్యాయులకు యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయనున్న కె.విజయగౌరికి ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం విజయనగరంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడారు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లోనూ ఉపాధ్యాయులతా విజయగౌరికి మద్దతు ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, పాఠశాలలో క్లస్టరీకరణకు వ్యతిరేకంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేసే పోరాటాలకు విజయ గౌరి అండగా ఉంటారని తెలిపారు. విద్యారంగంలో సమస్యలను పరిష్కరించేందుకు శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా ఉంటారని భావించి పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో అన్ని మండల శాఖలు నుండి ఫిబ్రవరి 6న జరిగే నామినేషన్ కార్యక్రమానికి ఎక్కువమంది ఉపాధ్యాయులు విశాఖపట్నం హాజరు కావాలని కోరారు. ఉద్యమాలతోనే ఉద్యోగ జీవితాన్ని గడిపిన విజయ్‌గౌరి శాసనమండలిలో ప్రవేశించడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమని, ఉపాధ్యాయులందరూ ఆలోచించి విజయ గౌరిని గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఈశ్వరరావు

సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జెఆర్‌సి పట్నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సంబంధ అధ్యయనం కమిటీ సభ్యులు డి. రాము, రాష్ట్ర కౌన్సిలర్ ఎ.సత్య శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



భూమి లోపల బ్లాస్టింగ్‌కు సిద్ధం చేస్తున్న రంధ్రం

నిబంధనలు బ్లాస్ట్

బ్లాస్టింగ్ అన్న పేరు వింటేనే గుండె జల్లుమంటుంది. ఇక బ్లాస్టింగ్ నిర్వహణ అంటే ప్రాణాలతో చెలగాటమే. కానీ జామి మండల కేంద్రంలో బ్లాస్టింగ్ అనేది దీపావళి సీమ టపాసులు కాల్చినంత సులువు. ఇదేంటి అనుకుంటున్నారా..? నిజమేనండి! జామిలోనే కాదు..., జిల్లాలోనే క్వారీ బ్లాస్టింగులు విచ్చలవిడిగా సాగిపోతున్నాయి. అనుమతులు లేకుండా కొందరు, కాగితాల్లోనే అరకొర లైసెన్సులు ఉన్నట్లు చూపించి మరికొందరు... ఇలా నిబంధనలను బ్లాస్ట్ చేసేస్తున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులు ఇచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి చూస్తే, నివ్వెరపోయే నిజాలు బయటపడ్డాయి.

- అడ్డగోలుగా క్వారీ పేలుళ్లు
- నరకయాతన పడుతున్న స్థానికులు
- చూసీ చూడనట్లు ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - జామి

జిల్లాలో సుమారుగా 200కు పైగా రోడ్డు మెటల్ క్వారీలకు మైనింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం లీజులు మంజూరు చేసింది. ఇందులో కొన్ని లీజులు రద్దు కాగా, కొన్ని లీజులు మనుగడలో ఉన్నాయి. జామి మండల కేంద్రంలో క్వారీ లీజులను పరిశీలిస్తే, సర్వే నెంబర్ 394లో హెక్టారుకు గానూ 2017లో 15 ఏళ్ల కాలానికి ప్రభుత్వం లీజు మంజూరు చేసింది. బ్లాస్టింగ్ చేయడానికి గానూ పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పిఇఎస్‌ఒ) నుంచి ఒకరు బ్లాస్టింగ్ లైసెన్సు (2025 మార్చి 31 వరకు గడువు) పొందారు. కానీ బ్లాస్టింగ్ నిర్వహించడానికి ఎక్స్‌ప్లోజివ్ రూల్స్ 2008 ప్రకారం షాట్ ఫైరర్ పర్మిట్ పొందిన లైసెన్స్ బ్లాస్టర్ ఉండాలి. కాబట్టి 2016లో క్లాస్ - బి కేటగిరీ (భూమిపై భాగంలో మాత్రమే బ్లాస్టింగ్ అధికారం) లైసెన్సు పొందారు. దాని గడువు 2026 ఆగస్టు 18తో ముగుస్తోంది. ఇలా లైసెన్సులు పొందినప్పటికీ బ్లాస్టింగ్‌కు 200 మీటర్లను డేంజర్ జోన్‌గా బౌండరీ ఏర్పాటు చేసి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ప్రకారం పర్యావరణం దెబ్బతినకుండా బ్లాస్టింగ్ నిర్వహించాలి. కానీ ఇవేవీ పట్టించుకోకుండా, భూమి నుంచి 50 అడుగుల లోతు వరకు రంధ్రం పెట్టి బ్లాస్టింగులు నిర్వహిస్తున్న పరిస్థితి. జాతీయ రహదారి నిర్మాణ (పిఎస్‌కె) సంస్థ ఒక బినామి పేరిట సర్వే నంబర్ 464లో 2 హెక్టార్లు మైనింగ్‌కు లీజు పొందింది. వీరైతే ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి (క్లాస్-బి) షాట్ ఫైరర్‌గా కాగితాల్లో చూపించి సాధారణ వ్యక్తులతో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా లక్షలాది టన్నుల మైనింగ్ చేస్తున్నారు. మరో విచిత్రం ఏమిటంటే వీరికి ఎక్స్‌ప్లోజివ్ గోడౌన్ నెల్లిమర్ల మండలం టెక్కలి గ్రామంలో ఉన్నట్లు కాగితాల్లో చూపిస్తున్నారు. ఇక లైసెన్సులు లేని వారి పరిస్థితి చెప్పనవసరం లేదు. ఒక్క జామి గ్రామంలో మాత్రమే కాదు. జిల్లా వ్యాప్తంగా అడ్డగోలు బ్లాస్టింగులు నిర్వహిస్తున్నా, పోలీసులు, బ్లాస్టింగును పద్ధతి ప్రకారం నిర్వహించాల్సిన పర్యావరణ అధికారులు పట్టించుకునే పాపాన పోవడం లేదు.

ప్రజా ఫిర్యాదులు బుట్టదాఖలు

జామి మండల కేంద్రంలో మాధవరాయమెట్ట చుట్టూ ఉన్న క్వారీల్లో విచ్చలవిడిగా పేలుళ్లు నిర్వహించడంతో కాలనీ ఇళ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని అనేక దఫాలు అధికారులకు వినతులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ సమయాల్లో పోలీస్‌స్టేషన్, ఎంఆర్‌ఒ కార్యాలయ భవనాలు కూడా బీటలు వారుతున్నా వారికి పట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా వద్ద ఫైల్స్ లేవే లేవు

జిల్లాలో బ్లాస్టింగులకు సంబంధించిన లైసెన్సుల ఫైల్స్ ఇవ్వాలని జామి గ్రామానికి చెందిన ఓ న్యాయవాది రాసిన సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు అటువంటి ఫైల్స్ లేవని జిల్లా కలెక్టర్ కార్యాలయం బదులు ఇవ్వడం గమనార్హం. గనుల శాఖ కూడా తమ వద్ద సమాచారం లేదని చెప్పడం విశేషం.

మాకు సంబంధం లేదు

క్వారీ బ్లాస్టింగుల అంశం గనుల శాఖ చూస్తోంది. మా శాఖకు ఎటువంటి సంబంధమూ లేదు. లైసెన్సులు కూడా మా పరిధి కాదు.

- సరిత, పర్యావరణ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలి

మాకూ సంబంధం లేదు



క్వారీల్లో బ్లాస్టింగులను పర్యవేక్షించే బాధ్యత మాది కాదు. మాకు తెలిసి గనుల శాఖ దీనిని చూస్తుంది. కాబట్టి దీనిపై ఏమీ చెప్పలేం.

- వకుల్ జిందాల్, ఎస్‌పి

పాడి రైతుల జీవనోపాదులను దెబ్బతీస్తూ విశాఖ డెయిరీ తీసుకుంటున్న నిర్ణయాలు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ ప్రాంత రైతన్నలు పాడి పశుపోషణ జీవనాధారంగా ఎంచుకొని పాల అమ్మకాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. వీరికి అండగా విశాఖ డెయిరీ ముందుకు వచ్చి దశాబ్దాల కాలంగా గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆడారి తులసీరావు డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. రైతులకు విద్య, వైద్య, ఉద్యోగాల కల్పన కోసం ట్రస్ట్ ఏర్పాటు చేసి డెయిరీని లాబాల బాటలో నడిపించారు. అయితే తులసీరావు మరణం తరువాత వీరి కుమారుడు ఆనంద్ కుమార్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి.



విశాఖ డెయిరీ దొంగదెబ్బ

- పాడి రైతులను కుంగదీస్తున్న యాజమాన్యం
- సేకరించిన పాలను మార్కెట్ చేసుకోలేకపోతున్న పాలక వర్గం
- పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలపై ఆంక్షలు
- కోర్టులను ఆశ్రయిస్తామంటున్న రైతులు

ప్రజాశక్తి - రామభద్రపురం

విశాఖ డెయిరీ పరిధిలో 3.80 లక్షల మంది పాల రైతులున్నారు. డెయిరీ నిర్ణయాలతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు. రామభద్రపురం మండలంలోని 70 సంఘాల పరిధిలో 5 వేల మంది పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు సభలు, సమావేశాలు, నిరసన ర్యాలీలు నిర్వహించి డెయిరీ నిర్ణయాన్ని ఎండగడుతూ పాల ధరలు పెంచాలని, ఏటా రెండుసార్లు బోనస్‌లు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. డెయిరీలో అవినీతి రాజ్యమేలుతుందని, నిధులు గోల్ మాల్ అయ్యాయని అందుకే నష్టాలు సాకు చూపి పాల ధరలు అమాంతం తగ్గించారని నిరసనలు వెల్లువెత్తాయి. దీనికి తోడు డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా వారి సమస్యలపై గలమెత్తి నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరిగి ప్రభుత్వం సభా సంఘాన్ని ఏర్పాటు చేసి ఒక కమిటీ కూడా వేసింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో పలు విచారణలు కూడా జరిగాయి. అయితే అనూహ్యంగా డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, పాలక వర్గం కూటమి ప్రభుత్వాన్ని ఆశ్రయించి బీజేపీలో చేరడం గమనార్హం.

తాజాగా రైతు నెత్తిపై మరో పిడుగు

ఇప్పుడు తాజాగా రైతు నెత్తిపై మరో పిడుగు పడింది. పాలను మార్కెట్ చేయలేక పోతున్నామని, పాల సేకరణ తగ్గించుకోవాలని లేదంటే వారానికి ఒక రోజు పాల సేకరణ నిలుపుదల చేస్తామని, నాణ్యత లేని పాలు తిరిగి పంపి వేస్తామని హెచ్చరికలు జారీ చేస్తూ పాలక వర్గం సభ్యులు రైతన్నకు సమాచారం అందించారు. విశాఖ డెయిరీని నమ్ముకొని పశువుల్ని పోషిస్తున్న రైతుకు ఈ చేదు సమాచారం పాడిపై పెంచుకున్న ఆశలు నిరాశ అయ్యేలా చేసింది. పూటకు 30 లీటర్లు ఆవు పాలు 10 లీటర్ల గేదె పాలు ఉండాలని, వెన్న శాతం ఆవు3, గేదె 5 శాతం ఉంటూ ఎస్ఎన్ఎఫ్ 8.8.20గా లేకపోతే ఆ పాలు తిరిగి సేకరణ కేంద్రాలకే పంపివేస్తామని సంబధిత డెయిరీ అధికారులు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే పాడి పశువు ఆరోగ్యం, ఈనిక కాలం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వెన్న శాతంలో హెచ్చు తగ్గులు రావడం సహజం. గతంలో ఇలా వస్తే ధర తగ్గించి లేదా పెనాల్టీ ధరతో పాలను తీసుకొనేవారు. ఇప్పుడు సేకరించి పంపిన పాలు నాణ్యతా ప్రమాణాలు పేరుతో తిరిగి వెనక్కి పంపించడం సంఘాలను నిర్వీర్యం చేసే కుట్రగా పలువురు రైతులు విమర్శిస్తున్నారు. అలా పంపిన పాలు వినియోగానికి పనికి వచ్చే సమయం దాటిన తరువాత వస్తాయని మరల ఆ పాలను రైతుకు ఎలా ఇవ్వగలం అని సేకరణ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంఘ బైలా నిబంధనల మేరకు కోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని పలువురు రైతులు హెచ్చరిస్తున్నారు. అత్యధిక లాభాల బాటలో ఉన్న డెయిరీని నష్టాల ఊబిలోకి నెట్టి రైతుల జీవనోపాదులు దెబ్బతీసే కుట్రలు మానుకోవాలని రైతు శ్రేయస్సుకు పాత పద్ధతిలోనే పాల సేకరణ జరపాలని, తగ్గించిన ధరలు పెంచాలని సంక్షేమ కార్యక్రమాలు శత శాతం అమలు చేయాలని ప్రజాసంఘాలు, పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రత్యక్ష రాజకీయాలతో రైతులకు అవస్థలు

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగి మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. వేల కోట్ల లాభాల్లో ఉన్న డెయిరీ నష్టాల్లో ఉన్నట్లు ప్రకటించారు. అయితే డెయిరీ ఆస్తులు, లాభాలు సొంతానికి వాడుకొని ఎన్నికల్లో ఆ సొమ్ము వినియోగించడమే నష్టాలకు కారణం అని కొందరు చెబుతున్నారు. దీనికి ఊతమిస్తూ పాల సేకరణ ధర రూ.5 నుంచి 10 రూపాయలు తగ్గించడంతో, ఇప్పటికే పాలకు గిట్టుబాటు ధర లేక దానా ఖర్చులకే పాల రాబడి సరి పోవడం లేదని భావిస్తున్న రైతు నెత్తిన పిడుగు పడినట్లయ్యింది.

డెయిరీ ఆస్తులను లూటీ చేస్తున్న యాజమాన్యం

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా : పాల రైతు సంఘం

లక్కవరపుకోట : విశాఖ డెయిరీ ఆస్తులను యాజమాన్యం లూటీ చేస్తోందని, దీనిపై సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామని పాలరైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల సేకరణ ధర పది శాతం తగ్గించిందన్నారు. గత నవంబర్లో సేకరణ ధర రూ.4 వరకు తగ్గించిందని చెప్పారు. ఇలా వరుస పెట్టి పాల రైతులను నష్టపరుస్తూ రైతులను నిండా ముంచుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై ప్రశ్నిస్తున్న రైతులపై కక్ష సాధింపులకు పాల్పడి, పాల సేకరణ ఆపుతామని బెదిరిస్తోందని మండిపడ్డారు. యాజమాన్యం కోఆపరేటివ్ స్ఫూర్తిగా భిన్నంగా నడుస్తోందని తెలిపారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు, రైతులు శ్రమతో నిర్మితమైన విశాఖ డెయిరీ స్వార్థపరుల అక్రమాలకు అడ్డాగా మారిందని చెప్పారు. డెయిరీ యాజమాన్యం తీరుపై సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు పాల రైతులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడు అప్పారావు, తరిణి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో భారీ చోరీ

రూ.20 లక్షలు నగదు, 40 తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. రూ.20 లక్షల నగదు, 40 తులాల బంగారాన్ని దుండగులు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలో సాయికృష్ణ జువెలరీ షాపు యజమాని గ్రంధి రవి కుంభమేళాకు వెళ్లేందుకు శనివారం సాయంత్రం విశాఖలోని బంధువుల ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. శనివారం రాత్రి దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి, రూ.20 లక్షల నగదు, 40 తులాల బంగారు నగలను అపహరించుకుపోయారు. ఇంటి పని మనిషి ఇంటి వైపు వెళ్లి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో యజమానికి ఫోన్ చేసి చెప్పారు. వెంటనే ఆయన ఇంటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిఎస్‌పి భవ్యరెడ్డి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గ్రంధి రవి ఇంటి కంటే ముందు మరో ఇంట్లో చోరీ చేసేందుకు ప్రయత్నించి, సాధ్యం కాకపోవడంతో రవి ఇంట్లో దొంగతనానికి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించారు. సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామని డిఎస్‌పి భవ్యరెడ్డి చెప్పారు.



వివరాలు ఆరాతీస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

సత్య కళాశాల ఎన్‌సిసి కేడెట్లకు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని సత్య డిగ్రీ కళాశాల ఎన్‌సిసి కాడెట్లు జూనియర్ అండర్ ఆఫీసర్ భాస్కరరావు, జూనియర్ అండర్ ఆఫీసర్ కుమారి. పావనికి మేజర్ భాను చందర్ నారాయణం మెమోరియల్ అవార్డు లభించింది. ఈ అవార్డును భాను చందర్ తండ్రి భానుమూర్తి, పెద్ద నాన్న నరసింహరావు, స్పార్క్ సొసైటీ వ్యవస్థాపకులు పద్మనాభం, ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారావు కలసి అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవ మణి, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ ఎం.సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ సి సి కాడెట్లు పాల్గొన్నారు.




కేడెట్లను అభినందిస్తున్న కృష్ణారావు, సాయిదేవమణి

జిల్లాలో డయేరియా లేదు

- కుష్టు వ్యాధిపై అవగాహనా కార్యక్రమాలు
- ఆస్పత్రుల్లో మందులన్నీ అందుబాటులోనే..
- 'ప్రజాశక్తి'తో డిఎంహెచ్‌ఒ జీవనరాణి ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంకోట

కుష్టు వ్యాధిపై ఈనెల 13 వరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. స్పర్శ లేని మచ్చలున్న వారు తమ దగ్గరలోని వైద్యఆరోగ్య సిబ్బందిని సంప్రదించి తనిఖీలు చేయించుకోవాలని చెప్పారు. సీజనల్ జ్వరాలు, వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడా డయేరియా లేదని, ప్రజలంతా పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ప్రజాశక్తికి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.



విజయనగరంలో స్కానింగ్, మెడికల్ పరీక్ష కేంద్రాలు పుట్టగొడుగుల్లా మాదిరిగా పుట్టుకొస్తున్నాయి. వీటికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేవా, జిల్లా వ్యాప్తంగా ఎన్ని స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి?

జిల్లాలో ప్రభుత్వ పరిధిలో స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ పరిధిలో 23 ఉండగా ప్రవేట్ పరిధిలో 92 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. మెడికల్ పరీక్ష ల్యాబ్‌లు ప్రైవేటు పరిధిలో 64ఉన్నాయి. వీటన్నింటికీ అనుమతులున్నాయి.

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగినంత వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా ? రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదనే ఫిర్యాదులున్నాయి?

జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ తగినంత వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. గతంతో పోలిస్తే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. రోగులు ప్రైవేటు ఆస్పత్రులను కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులను వినియోగించుకోవాలి.

జిల్లాలో క్షయ, ఎయిడ్స్ ,కుష్టు వ్యాధి గ్రస్తులు ఎంతమంది ఉన్నారు? గత మూడు నాలుగు ఏళ్ల కంటే రోగుల సంఖ్య తగ్గిందా పెరిగిందా?

జిల్లా వ్యాప్తంగా టిబి కేసులు 2024 కన్నా ఈఏడాది తక్కువగా నమోదయ్యాయి. ఎయిడ్స్ కేసులు 6464 ఉన్నాయి. 2024 సంవత్సరంలో కుష్టు వ్యాధి కేసులు 283 నమోదు జరిగాయి.



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు అన్ని రకాల మందులూ అందుబాటులో ఉండడం లేదు. వైద్యులు బయట షాపుల్లో కొనుక్కోవాలని చీటీలు రాస్తున్నారు. కారణం ఏమిటి?

ప్రభుత్వం 216 హెల్త్ వెల్నెస్ సెంటర్లకు, 104 పిహెచ్‌సిలకు, జిల్లా ఆసుపత్రికి 478 రకాల మందులు అందిస్తున్నారు. మందుల కొరత లేదు. డాక్టర్లు బయట మందులు రాస్తున్నాంనేది అవాస్తవం.

ప్రస్తుతం నిర్వహిస్తున్న కుష్టు అవగాహన ర్యాలీలో ఎన్ని బృందాలు పాల్గొంటున్నాయి. ఎంత మంది సిబ్బంది పాల్గొంటున్నారు?

కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఎల్‌సిడిసి సర్వేను జిల్లాలో 1790 టీములు ద్వారా నిర్వహిస్తున్నాం. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వరకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. ఒక్కో టీమ్‌లు ఆశా కార్యకర్త, ఒక మేల్ అటెండర్‌తో సర్వే నిర్వహిస్తున్నాం.

జిల్లాలో తరచూ డయేరియా ప్రబలుతుంది. కారణాలేమిటి? నివారణకు తీసుకుంటున్న ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రస్తుతం జిల్లాలో డయేరియా కేసులు లేవు. అపరిశుభ్రతే డయేరియా ప్రబలడానికి ముఖ్యకారణం. ప్రజలంతా పరిశుభ్రత పాటించాలి. ఇంటింటి సర్వే ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాం.



ప్రమాదానికి గురైన కారు ; మృతిచెందిన ఉపాధ్యాయిని సౌజన్య(ఇన్‌సెట్‌లో)

ప్రాణం తీసిన పొగమంచు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పొగమంచు కారణంగా ఓ ప్రాణం పోయింది. మండలంలోని కనిమెట్ట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో భోగాపురం మండలం పోలిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని కింగువ భవాని (45) మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం...

పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన సౌజన్య భోగాపురం మండలం పోలిపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని పిఎంపాలెంలో నివాసముంటున్నారు. కింగువ సౌజన్య , భర్త రవి, కుమారుడు ఉదయ్, కుమార్తె హన్సిక, ఆమె తల్లి భోగి భవానితో కలిసి గత నెల 27న కారులో కుంభమేళాకు వెళ్లారు. అనంతరం ఈ నెల ఒకటో తేదీ స్వస్థలానికి ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం తెల్లవారి పూసపాటిరేగ మండలం కనిమెట్ట దగ్గరికి వచ్చేసరికి జాతీయ రహదారిపై శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొంది. డ్రైవర్ ప్రసాద్ వెనుక భాగంలో కూర్చున్న సౌజన్యకు తీవ్రగాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే వారిని 108 వాహనంలో విజయనగరం తరలించారు. ఆదివారం తెల్లవారుజామున విపరీతంగా పొగమంచు కురిసింది. దీంతో ముందు వెళ్తున్న వాహనం కనిపించక పోవడంతో లారీని కారు ఢీకొన్నట్లు భావిస్తున్నారు. ఆమె భర్త రవికుమార్ విశాఖపట్నంలోని ప్రయివేటు కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

జీడి, మామిడిపై మంచుదెబ్బ

జీడి, మామిడి పూతపై ప్రభావం ● ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-వంగర

గత కొద్ది రోజులుగా ఉదయం 9 గంటల వరకు దట్టంగా మంచు కురుస్తోంది. దాని ప్రభావం జీడి, మామిడి పూతపై పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జీడి, మామిడి పూత ఇంతవరకు సరిగా రాలేదు. దీంతో పంట నష్టం తప్పదని జీడి, మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని బంగారువలస, కొండ చాకరాపల్లి, వంగర, కొప్పరవలస, వివిఆర్ పేట, రాజుల గుమ్మడ తదితర గ్రామాల్లో సుమారు 400 ఎకరాలకు పైబడి జీడి, మామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటలు సాగు చేస్తున్న వారంతా పేదలే. ఏడాదికి ఓసారి వచ్చే ఈ జీడి, మామిడి పంటను కోసం వారంతా ఎదురుచూస్తూ ఉంటారు. ఎందుకంటే ఆ పంటలను సాగు చేసుకుంటూ వారు జీవనం సాగిస్తూ ఉంటారు. గత ఏడాది ఇదే సమయానికి జీడి, మామిడి తోటలు ఎక్కువగా పూత పూయడంతోపాటు కాయలు ఉండేవని, చివరిలో పంట దిగుబడి కూడా బాగుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది చూస్తే ఫిబ్రవరి నెల మొదలైనా ఇంతవరకు కూడా జీడి, మామిడి తోటలు పూత కూడా రాని పరిస్థితి నెలకొంది. పూత కొంతమేర కొన్నిచోట్ల వచ్చినప్పటికీ గత కొన్ని రోజుల నుంచి విపరీతంగా కురుస్తున్న మంచు ప్రభావంతో పూత మాడిపోతుందని రైతులు వాపోతున్నారు.



మంచు ప్రభావంతో మాడిపోయిన మామిడి పూత



దట్టంగా కురుస్తున్న మంచు

అకాల వర్షాలే కారణం..?

సహజంగా జీడి, మామిడి పూత డిసెంబర్ నెలలో వస్తుంది. అయితే డిసెంబర్ నెలలో రెండుసార్లు అల్పపీడన ప్రభావంతో సుమారు 15 రోజుల వరకు వర్షాలు కురిసాయి. ఇదే పూత ఆలస్యానికి కారణమని సంబంధిత ఉద్యాన శాఖ శాఖ అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

ఇటీవల కురుస్తున్న మంచు వల్ల జీడి, మామిడి పూత విచ్చుకునే దశలో నష్టం జరుగుతుంది. ఇప్పటికే రెండు మూడు సార్లు మందులు పిచికారీ చేస్తే ఇబ్బంది ఉండదు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాం.

- ఉమామహేశ్వరి,
ఉద్యాన శాఖ అధికారి, వంగర మండలం



రహదారిని కప్పేసిన పొగమంచు

మంచు దుప్పటి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచు వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజామున నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు తీవ్రంగా కురవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచు ప్రభావంతో చలి తీవ్రత పెరిగింది. మంచుతో మామిడి, జీడి పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



భోగాపురంలోని గంగరాళ్ల చెరువుపై దట్టంగా కురుస్తున్న పొగ మంచు

చెరువును కప్పేసింది

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో రెండు రోజుల నుంచి పొగ మంచు విపరీతంగా కురుస్తోంది. భోగాపురంలోని ముక్కాం వెళ్లే కూడలి వద్దనున్న గంగరాళ్ల చెరువును కప్పేసిన పొగ మంచే దీనికి నిదర్శనం. దీంతో జాతీయ రహదారిపై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటల వరకు పొగ మంచు పడుతుండడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం పూట హైవేపై వాహనాలు విచ్చలవిడిగా, ఎక్కడపడితే అక్కడ ఆపకుండా ఉండేలా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఎక్కడైనా వాహనాలు ఆపితే ఆగి ఉన్న వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అంటున్నారు.

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వెన్నుపోటు

నెల్లిమర్ల : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీ తగ్గించి రైతులకు వెన్నుపోటు పొడిచిందని ఎపి రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎరువులపై సబ్సిడీ తగ్గించడం దారుణమన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎరువులకు సబ్సిడీ తగ్గించడంతో కార్పొరేట్లకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎరువుల సబ్సిడీ తగ్గించడంతో పంటలు పండించే పరిస్థితి కనిపించదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మిక రంగాన్ని కూడా విస్మరించిందన్నారు.

ఆంధ్ర ఎస్‌ఐపై విచారణ

ఆదేశాలు జారీ చేసిన ఎస్‌పి

విజయనగరంకోట : ఎంఎల్‌సి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు ఆంధ్ర ఎస్‌ఐ కె.సీతారాములుపై వచ్చిన ఆరోపణలపై ఎస్‌పి వకుల్ జిందాల్ విచారణకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఎమ్మెల్యే కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కొంతమంది రాజకీయ నాయకులను ఆయన కలిసినట్టుగా ఆరోపణలు రావడంతో బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డిని విచారణ చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. విచారణలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు తేలితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎస్‌పితెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం

బొబ్బిలి : విద్యార్థుల్లో పోటీతత్వం అవసరమని డిప్యూటీ డిఇఒ కె.మోహనరావు తెలిపారు. ఆదివారం రాజా కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాష ప్రతిభా పాటవ పోటీలను డెల్టా అధ్యక్షులు ఎం.విజయ మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రశ్నపత్రాలను డెల్టా వ్యవస్థాపకులు మింది గుంప స్వామి , రౌతు రామ్మూర్తి, బొత్స సత్యనారాయణ, నంబియార్ వేణుగోపాలరావు, ఎంఇఒ జి.వాసు విడుదల చేశారు. ఈ పరీక్షకు 347 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు.

4న జ్యూట్ కార్మికుల వర్ధంతి సభ

నెల్లిమర్ల : ఈ నెల 4న జ్యూట్ కార్మికుల వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షులు కాళ్ల అప్పలసూరి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జ్యూట్ కార్మిక ఉద్యమంలో అసువులు బాసిన ఐదుగురు కార్మికుల 31వ వర్ధంతి సభను స్థానిక అమర కార్మిక భవనంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సతీష్‌కు పురస్కారం

వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన చీపురుపల్లి సతీష్‌కు తెలుగు వెలుగు నంది పురస్కారం లభించింది. సంగీతం, కీ బోర్డు కళా రంగంలో ఆయన చేసిన సేవలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అందజేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

ప్రజాశక్తి- భోగాపురం



లీలా (ఫైల్)

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో మిరాఖిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువతి మృతి చెందింది. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పోలిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. ముంజేరు సమీపంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో అనకాపల్లి జిల్లా దేవరపల్లికి చెందిన రొంగళి లీలా (23), పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి చెందిన అడపాక శివ గణేష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై తగరపువలస వెళ్లారు. తగరపువలస నుంచి తిరిగి వస్తున్న సమయంలో పోలిపల్లి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో లీల అక్కడికక్కడే మృతిచెందగా శివ గణేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తగరపువలసలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ ఎన్ వి ప్రభాకర్ తెలిపారు .

రామచంద్రపురంలో చోరీ

ప్రజాశక్తి-బాడంగి

మండలం లోని రామచంద్రపురంలో గుర్తు తెలియని వ్యక్తులు చప్ప కృష్ణ మూర్తి ఇంట్లో ఆదివారం ఉదయం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమారుగా 3 తులాలు బంగారం, రూ.12వేల నగదును అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు.

తాగుబోతుల వీరంగం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని వన్‌వే ట్రాఫిక్ జంక్షన్‌లో శనివారం రాత్రి కొంతమంది తాగుబోతులు వీరంగం సృష్టించారు. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. వన్‌వే జంక్షన్ వద్దనున్న మద్యం దుకాణం పక్కన ఉన్న రాజు కిరాణా షాపులో నలుగురు యువకులు తాగిన మత్తులో బ్లేడ్లు అడిగారు. బ్లేడ్లు ఇస్తే తాము కోసుకుంటామని చెప్పగా, లేవని షాపు యజమాని బదులిచ్చాడు. దీంతో షాపు బయట ఉన్న ఖాళీ సామాన్లను ధ్వంసం చేశారు. సీసాలతో షాపు షెల్టర్‌ని పగలగొట్టారు. అదే సమయంలో ఘటనా స్థలానికి వెళ్లి ఫొటో తీస్తున్న విలేకరిపై నలుగురు యువకులు దాడి చేశారు. ఈ దాడిలో ఆయన చెవి కింద భాగంలో గాయమైంది. నలుగురు యువకులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆందోళన విరమణ

ఎమ్మెల్సీ రఘురాజు హామీతో



ఆతవ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి-వేపాడ

ఎమ్మెల్యే ఇందుకూరి రఘురాజు హామీతో ఆతవ గ్రామస్తులు ఆందోళనను విరమించారు. ఆతవ గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతూ వారం రోజులుగా ఆ గ్రామస్తులు ఆందోళన చేపడుతున్నారు. రోజుకో రూపంలో నిరసన తెలియజేస్తూ వచ్చారు. ఆదివారం గ్రామస్తుల నిరసన శిబిరం వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ వారికి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదికి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారులు పనులు ప్రారంభించకపోతే, తన సొంత డబ్బులతోనైనా రోడ్డు పని ప్రారంభిస్తానని ఆయన హామీఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచ్ వి.రామునాయుడు, సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తి ఆస్పత్రిలో అరుదైన ముఖ శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి-విజయనగరం కోట

డాక్టర్ శ్రీరామ్మూర్తి హాస్పిటల్ లో ముఖానికి ఎనిమిది గంటల కష్టపడి అరుదైన శాస్త్ర చికిత్స నిర్వహించినట్లు సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎమ్‌డి శ్రీరామమూర్తి తెలిపారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఉన్న సాయి ఆర్థో ఆసుపత్రిలో ఇటీవల ముఖానికి సంబంధించి అరుదైన ఫేషియల్ సర్జరీ నిర్వహించారు. ఈ సర్జరీకి సంబంధించి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రీరామమూర్తి ఆదివారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనవరి 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయనగరం జిల్లా డెంకాడ మండలానికి చెందిన సత్యం అనే వ్యక్తి తమ ఆసుపత్రిలో చేరాడన్నారు. ఆయనకు ముఖం చిదిగిపోవడంతో ఫేషియల్ సర్జరీ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.బాలసుందర రాజు, డాక్టర్ దకె.దినీషా సంయుక్తంగా శస్త్ర చికిత్స నిర్వహించి ఆయనను బతికించడం తోపాటు ముఖానికి పూర్వపు రూపం వచ్చేలా శస్త్రచికిత్స చేశారని తెలిపారు. సుమారు రూ.2 లక్షల రూపాయలు ఖర్చు అయ్యే ఈ శస్త్ర చికిత్సను సాయి ట్రస్ట్ ఆర్థిక సాయంతో కేవలం 50 వేల రూపాయలకే నిర్వహించిందన్నారు. ఇక మీదట ఫేషియల్ సర్జరీలు కూడా స్థానిక సాయి ఆసుపత్రి లో నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఫేషియల్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ బాల సుందర రాజు, డాక్టర్ కె.దినీషా పాల్గొన్నారు. శస్త్ర చికిత్స నిర్వహించిన ఇరువురు ఫేషియల్ సర్జరీ స్పెషలిస్ట్‌లకు డాక్టర్ శ్రీరామమూర్తి సత్కరించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని మహారాజ కళాశాల బి.కాం.పూర్వ విద్యార్థులు 49 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకున్నారు. 1976-79లో డిగ్రీ చదివిన వీరంతా వివిధ చోట్ల పలు రంగాల్లో స్థిరపడ్డారు. పిల్లల పెద్దవారై దాదాపు వృద్ధాప్యానికి చేరుకున్నారు. ఇలాంటి సమయంలో ఉల్లివీధి ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో వీరంతా కలుసుకోవడంతో వారిలో ఆనందానికి అవధులు లేవు. దేశ, విదేశాల్లో ఉంటున్న వీరంతా కలిసి రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తాము చదివిన ఎం.ఆర్.కళాశాలకు వెళ్లి కొంతసేపు గడిపారు. తమ బ్యాచ్ ద్వారా విజయనగరంలో గత కొన్నేళ్లగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఏ విధమైన సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే విషయమై చర్చించారు. వచ్చే ఏడాది కూడా ఎక్కువ మంది సభ్యులు ఇదే వేదికపై కలవాలని నిర్ణయించుకున్నారు. వివేకానంద, పేర్ల సీతారామయ్య శెట్టి, రామ్‌జి, కాపుగంటి ప్రకాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-డెంకాడ

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. ఆదివారం మండలంలో గుణుపూరుపేట జంక్షన్, నాతవలస, మోదవలస, జొన్నాడ, చింతలవలస ఐదో బెటాలియన్ మెయిన్ గేట్, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. వాహనదారుల్లో చైతన్యం తెచ్చేందుకు ముఖ్యమైన కూడళ్లలో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

రామభద్రపురం : మండల పరిధిలోని ఆరికతోట వద్ద ఎస్‌ఐ ప్రసాదరావు ఆదివారం వాహన తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం వేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై కూడా కారు, ఇతర పెద్ద వాహనాలను తనిఖీ చేశారు.

వైభవంగా పరదేశమ్మ జాతర

ప్రజాశక్తి-వేపాడ



పోటీలో పాల్గొన్న ఎడ్లబండి

మండలంలోని బక్కు నాయుడుపేట గ్రామంలో ఆదివారం పరదేశమ్మ జాతర వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో 13 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులను టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ వేచలపు వెంకట చినరామనాయుడు, సర్పంచ్ ఎం.అర్జునమ్మ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ దేవుడు, రవిశంకర్ గుమ్మడి, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

సొంత నిధులతో శ్మశానం అభివృద్ధి

జనసేన నాయకులు మహంతి శివ ఔదార్యం



పనులను పరిశీలిస్తున్న జనసేన నాయకులు మహంతి శివ

ప్రజాశక్తి -పూసపాటిరేగ

పూసపాటిరేగలోని పెద్దచెరువు గట్టుపై ఉన్న శ్మశాన వాటికను సొంత నిధులతో జనసేన నాయకులు మహంతి శివ అభివృద్ధి చేస్తున్నారు. దశాబ్దాలుగా పూసపాటిరేగలోని యాతపేట, బూడివీధి, సాలిపేటకు చెరువు గట్టే శ్మశాన వాటికగా ఉంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారం కూడా అంతంత మాత్రంగా చేయాల్సిన పరిస్థితి అక్కడ నెలకొంది. ఈ నేపథ్యంలో ఇటీవల శ్మశానానికి దారేది? అని పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్పందించిన ఆయన శ్మశానవాటిక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుగట్టుపై నిలువు నీడ కూడా లేకపోవడంతో అంతిమ సంస్కారం జరిగే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని చెప్పారు. అందుకే సొంత నిధులతో శ్మశానంలో జెసిబితో డొంకలు తొలగించి, మట్టి తోలించి చదును చేస్తున్నట్లు తెలిపారు. సుమారుగా 300 ట్రాక్టర్ల లోడ్ మట్టి అవసరమని గుర్తించామన్నారు. ఆదివారం ఉదయం పని ప్రారంభించి చదును చేస్తున్నట్లు వెల్లడించారు. శ్మశానంలో షెడ్ కూడా నిర్మిస్తామని, దీంతో యాతపేట, బూడివీధి, సాలిపేటకు కొంత ఊరట లభిస్తుందని తెలిపారు.



సిఐటియులో చేరిన ఆటో కార్మికులతో నాయకులు సురేష్, శ్రీనివాస్

సిఐటియులోకి 120 మంది ఆటో కార్మికులు

ప్రజాశక్తి-గజపతినగరం

శ్రీలక్ష్మి కనకదుర్గ ఆటో యూనియన్ (సిఐటియు అనుబంధం)లో 120 మంది ఆటో కార్మికులు చేరారు. గజపతినగరంలోని మెంటాడ రోడ్డు స్టాండ్ వద్ద వీరంతా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యాన చేరారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నది సిఐటియు మాత్రమేనని చెప్పారు. రవాణా చట్టాన్ని రద్దు చేయాలని, రవాణారంగ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మార్చి 14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, యూనియన్ అధ్యక్షులు బాలి రాము, ఉపాధ్యక్షులు కాళ్ల రామానంద, కార్యదర్శి రెట్టంగి భాస్కరరావు, కనకల రమణ, సీతం నాయుడు, శంకర్రావు, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను అడ్డుకున్న యువకులు

కొండకిండాంలో యువకుల నిరసన

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని కొండకిండాంలో ఆదివారం యువకులు నిరసనకు దిగారు. తమ గ్రామ సమీపంలో ఉన్న స్టోన్‌క్రషర్, క్వారీ వల్ల గత కొన్నేళ్లుగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ నుంచి వస్తున్న ధూళితో తాగు నీరు కలుషితమై పలువురికి కిడ్నీ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వాపోయారు. శుక్రవారం సాయంత్రం క్వారీ బ్లాస్టింగ్ వల్ల గ్రామంలోకి రాళ్ల ముక్కలు వచ్చి పడ్డాయని చెప్పారు. ఈ నేపథ్యంలో యువకులు క్వారీ వాహనాలను అడ్డుకున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని వారు కోరుతున్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. సంజీవని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ మధుబాల దంపతులు, ట్రస్ట్ సభ్యులు ఉమ, రైల్వే విశ్రాంత ఉద్యోగి రమణ సహకారంతో వాటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవి, విశ్వనాథ గోవిందరావు, ట్రెజరర్ విశ్వనాథ శ్రావణ్ కుమార్, సభ్యులు నగేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.